ఉపేందర్ రెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళులు

ఉపేందర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ కీసర వేణుగోపాల్‌రెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డి భౌతిక కాయానికి ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతలపాటి భరత్ మహజన్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఇంజినీర్ల అథ్లెట్ మీట్

క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1: అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలోని జీజేఎం గ్రౌండ్‌లో ఎక్స్‌టెన్షన్ వద్దు–ప్రమోషన్ ముద్దు అనే నినాదంతో మూడో అథ్లెట్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా పాండునాయక్ మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగానే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 9 ఉమ్మడి జిల్లాల జట్లకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల మధ్య ఐక్యతను పెంచేందుకు ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లా జట్ల మధ్య జరిగిన పోటీలో నల్లగొండ జట్టు విజయం సాధించింది. సంఘం నల్లగొండ, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు దాసరి మల్లూస్, బొల్లెద్దు లక్ష్మణ్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు పిచ్చయ్య, సూర్యాపేట అధ్యక్షుడు స్వామి, రామకృష్ణ, లింగయ్య, హరికృష్ణ, రవికిరణ్, రమేశ్, చంద్రశేఖర్, వాజీద్ పాల్గొన్నారు.

పీఎన్ఎం శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలి

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రం సూర్యాపేటలో ఈ నెల 2, 3, 4వ తేదీల్లో నిర్వహించనున్న ప్రజా నాట్య మండలి నూతన కళారూపాల శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా నాట్య మండలి సూర్యాపేట జిల్లా నిర్మాణ బాధ్యుడు దూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు కళారూపాలతో ప్రజలను చైతన్యపరిచే ప్రజా నాట్య మండలి కళాకారులు నూతన కళారూపాలను రచించడం ద్వారా, శిక్షణ తీసుకోవడం ద్వారా ప్రజా ఉద్యమాలకు ఆయుధాలుగా ఉపయోగపడతాయన్నారు. మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కొత్తపాటలు, వీధి నాటికలు, పల్లె సుద్దులు వంటి నూతన కళారూపాల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా శిక్షణ తీసుకోనున్న కళాకారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కళాకారుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘంటసాల జ్ఞాపకార్థం పాటల పోటీలు

రాష్ట్రస్థాయి పోటీల్లో పాట పాడుతున్న గాయకుడు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 1: గాయకుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని సూర్యాపేటలో శ్రీ జ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళా వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యామా ప్రభాకర్, కవి హమీద్‌ఖాన్ అన్నారు. ఆదివారం స్థానిక బాలభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాటల పోటీల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఘంటసాల జ్ఞాపకార్థం పాటల పోటీలు నిర్వహించిన కళా వేదిక అధ్యక్షుడు, జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండా రమేశ్‌ను అభినందించారు. బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు కల్లూరి నాగయ్య, దేవులపల్లి ప్రశాంతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలను పెంపొందిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ

- సంస్థ జోనల్ కోఆర్డినేటర్ శివప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

కోదాడ, డిసెంబర్ 1: శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా మానవీయ విలువలను పెంపొందిస్తుందని ఆ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్.శివప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తమ్మరబండపాలెంలోని ఓ మామిడి తోటలో నిర్వహించిన కార్తిక వన భోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతన, ధ్యానంతో పాటు సమాజంలోని అన్ని వర్గాలు నైతిక విలువలతో సన్మార్గంలో నడిచేందుకు సంస్థ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ డాక్టర్ శివరాంప్రసాద్, డాక్టర్ రామారావు, కనకదుర్గ, లక్ష్మి, నరసింహాచార్యులు, నారాయణ రెడ్డి, చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

నూతనకల్, డిసెంబర్ 1: నేడు మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణిలో తమ సమస్యలపై ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

- ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

కోదాడ రూరల్, డిసెంబర్ 1: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వార్షిక సమాశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, నగదు రహిత వైద్యసేవలు అందించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. ఈ సమావేశంలో బంధం వెంకటేశ్వర్లు, బొలిశెట్టి వెంకటేశ్వర్లు, రూప్లా నాయక్, చేపూరి నరసింహారావు, లింగారెడ్డి, గొర్రె నాగరాజు, సురగాని లింగయ్య, వి.చంద్రశేఖర్, ఎస్‌కే.ఖాసీం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి

- విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్

కోదాడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్

కోదాడ టౌన్, డిసెంబర్ 1: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల్లోని స్థితిగతులను అధ్యయనం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ బృందం పర్యటిస్తోందని కమిషన్ సభ్యుడు చారుగొండ వెంకటేశ్ అన్నారు. ఆదివారం కోదాడలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సూర్యాపేట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఆర్డీఓ సూర్యనారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు, తరగతి గదులు, విద్యార్థుల ప్రమాణాలు, హాస్టల్ భవనం, వంటగది, భోజనం మెనూ తదితరాలు పరిశీలించారు. హాస్టల్‌లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు, హాస్టళ్ల స్థితిగతులను పరిశీలించి, వాటిని మెరుగుపర్చి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కోదాడ మండల విద్యాధికారి సలీంషరీఫ్, సూర్యాపేట విద్యాశాఖ సెక్రోరియల్ అధికారి జనార్ధన్, శ్రావణ్‌కుమార్, మాధురిశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మఠంపల్లి, డిసెంబర్ 1: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు శంకర్ (40) తన వ్యవసాయ పొలంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే 11 కేవీ విద్యుత్ వైర్ తెగిపడి పొలంలో పడింది. పొలంలో నీరు ఉండడంతో శంకర్‌కు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

పంపు ఆపరేటర్..

కోదాడ రూరల్: విద్యుత్ షాక్‌తో మున్సిపాలిటీ పంపు ఆపరేటర్ మృతిచెందిన ఘటన కోదాడలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌస్ (47) 12వ వార్డులో నీటి సరఫరాలో అంతరాయం తొలగించేందుకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

ఉద్యోగ విరమణ పొందిన లైన్‌మెన్ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్

నేరేడుచర్ల, డిసెంబర్ 1: ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని నేరేడుచర్ల విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ పందిరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముకుందాపురం లైన్‌మెన్ మోహన్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఏఈ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు విధి నిర్వహణలో మెరుగైన సేవ లందిస్తే చిరస్థాయిగా గుర్తుండి పోతారని పేర్కొన్నారు. మోహన్‌రెడ్డి ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. మేల్లేంపల్లి గురవయ్య, నరసింహారెడ్డి, ఖాదర్, విజయ్, కృష్ణయ్య, కృష్ణారెడ్డి, సురేశ్, మహేశ్, నర్సిరెడ్డి, వెంకటయ్య,ప్రేమ్‌కుమార్, కనకయ్య, ఉపేంద్రచారి పాల్గొన్నారు.

రైతులను ఎండబెట్టి పండుగలు చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తుంగతుర్తి, డిసెంబర్ 1: రైతులను ఎండబెట్టి ప్రభుత్వం పండుగలు చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, రబీ పంటలకు కాల్వల ద్వారా నీళ్లు ఎప్పుడు విడుదల చేస్తారో షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా, 24 గంటల కరెంట్, పంటలకు నీళ్లు వంటి ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వంపై రైతులు, ప్రజలు నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ సభలో ముఖ్యమంత్రి రైతులకు ఏదో మేలు చేసే ప్రకటన చేస్తారని భావిస్తే నిరాశే మిగిలిందన్నారు. బోనస్ పేరుతో రైతు భరోసాను ఎగ్గొట్టే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలన్నారు.బీఆర్ఎస్ నాయకులు తునికి సాయిలు గౌడ్, గాజుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తాసీల్దార్ శ్రీనివాసరావు

- తాసీల్దార్ శ్రీనివాసరావు

నూతనకల్, డిసెంబర్ 1: వసతి గృహాల్లో మెనూ తప్పక పాటించాలని తాసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు భోజనం చేశారు. అనంతరం స్టాక్ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ హస్సాన్ తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, డిసెంబర్ 1: రాష్ట్రంలో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించాలని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నారపరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంఘం కార్తిక వన భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కల్వకొను ప్రసాద్, సుధాకర్, చలపతిరావు, జగదీశ్, చంద్రప్రసాద్, అరుణ్‌కుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గరిడేపల్లి, డిసెంబర్ 1: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ సమీపంలోని మిర్యాలగూడ– కోదాడ ప్రధాన రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మేళ్లచెర్వు నుంచి శబరిమలకి అయ్యప్ప మాలధారులతో వెళ్తున్న కారు.. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న అప్పన్నపేట గ్రామానికి చెందిన మదార్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై చలికంటి నరేశ్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మదార్‌ను 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఏపూరు జడ్పీహెచ్ఎస్‌కు కుర్చీలు అందజేత

సూర్యాపేట, డిసెంబర్ 1 (ఆత్మకూర్.ఎస్): మండల పరిధిలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతుల కొరతను దాతల దృష్టికి తీసుకెళ్లడంతో, వారు స్పందించి ఆదివారం పాఠశాలకు అవసరమైన 15 కుర్చీలు, వాల్ పెయింటింగ్స్‌కు అవసరమైన సాయం అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ.బాసిత్ అన్నారు. ఎన్ఆర్ఐ సంపత్‌కుమార్ సహాయంతో పబ్బతి వెంకటేశ్వర్లు సమన్వయంతో పాఠశాలకు వసతులు సమకూరినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, వేణు, పుష్పకుమారి, విజయ్‌కుమార్, వెంకటేశ్, నాగేందర్, విజయ్, విజయమోహన్, రవి శాస్త్రి, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభాకర్ ఎన్నికపై హర్షం

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర అధ్యక్షుడిగా బొమ్మగాని ప్రభాకర్ ఎన్నిక హర్షణీయమని సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మగాని శ్రీనివాస్, తొగిటి మురళి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ..పేద ప్రజల రక్షణ కోసం, రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం కోసం ఐఏఎల్ కృషి చేస్తుందన్నారు. ప్రభాకర్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేసిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు నాతి సవిందర్, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సత్యనారాయణ, ఎరగాని వెంకటేశ్వర్లు, జి.రాజారాం, దోరెపల్లి రమేశ్, సుధీర్, పెండెం వాణి, శశిరేఖ, సరిత ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

తిరుమలగిరి, డిసెంబర్ 1: మండల కేంద్రానికి చెందిన కురెళ్ల రాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజుకు చికిత్స నిమిత్తం తిరుమలగిరి పాతబస్తీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.35 వేల ఆర్థిక సాయం అందజేశారు. సాయం అందజేసిన వారిలో యూత్ అధ్యక్షుడు పులిమామిడి నరేశ్, ఉపాధ్యక్షుడు కాసాని శ్యామ్, కోశాధికారి యాంగోజు మహేంద్రచారితదితరులు ఉన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి

పాలకవీడు, డిసెంబర్ 1: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కిష్టపాటి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం పాలకవీడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పంటకు కూడా పెట్టుబడి సాయం అందించకపోగా, రైతుబంధు కంటే ధాన్యానికి బోనస్ పథకం బాగుందని మంత్రులు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రభుత్వం రైతుల పెట్టుబడి సాయం ఎత్తేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇతర హామీలను అమలు చేయాలని కోరారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

పెన్‌పహాడ్: అనంతారంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతులు

పెన్‌పహాడ్, డిసెంబర్ 1: మండలంలోని అనంతారం, సింగారెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడంలో ఆలస్యం కావడంతో ధాన్యం రాశులు కుప్పలుకుప్పలుగా పేరుకుపోయాయని రైతులు వాపోయారు. తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

చిలుకూరు: అకాల వర్షానికి మండల కేంద్రంతో పాటు బేతవోలు, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, దూదియతండా, సీత్లాతండా, నారాయణపురంతో పాటు పలు గ్రామాల్లో వరి పొలాలు దెబ్బతిన్నాయి. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించే గొంతుకలపై కేసులు పెడుతున్న ప్రభుత్వం

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 1: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 7వ గ్యారెంటీని అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, దండ వెంకటరెడ్డి, మద్దెల జ్యోతి అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో స్వేచ్ఛ ఉంటుందని సచివాలయానికి ఉన్న గేట్లను తొలగించారని, రాష్ట్ర ప్రజలకు 7వ గ్యారెంటీగా స్వేచ్ఛను అందిస్తామని చెప్పి నేడు ప్రశ్నించే గొంతుకలను అక్రమంగా అరెస్ట్ చేసి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా నేటికీ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. హామీల అమలుకు బలమైన పోరాటాలు నిర్మిస్తామని హెచ్చరించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, పారేపల్లి శేఖర్‌రావు, నాగారపు పాండు, కోట గోపి, కోట రమేశ్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యతో ప్రతి సమస్యకు పరిష్కారం

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న పటేల్ రమేశ్ రెడ్డి

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 1: విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలని, విద్య జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇమాంపేట గ్రామ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో త్వరలో ప్రహరీ, ఆట స్థలం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.1.20 కోట్ల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో వంట గదిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న కొండా దేవయ్య పటేల్

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్

హుజూర్‌నగర్, డిసెంబర్ 1: రాష్ట్రంలో మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో విడుదల చేసి 8 నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. ఈ సమావేశంలో రజినీకాంత్, కోలా నాగేశ్వర్‌రావు, రఘు, రవి, శ్రీనివాస్, సత్యనారాయణ, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గరిడేపల్లి: వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

నేరేడుచర్ల : వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

నేరేడుచర్ల, డిసెంబర్ 1: ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక